క్లుప్తంగా

నేడు ఆర్డీఓ సమీక్ష

పామిడి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం ఉంటుందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ జీ లక్ష్మీనారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. సమావేశానికి రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్ఏలు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రత్యామ్నాయ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఏఓ స్వాతి

గుంతకల్లు రూరల్: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఇప్పటివరకూ పంట సాగు చేయని రైతుల కోసం ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్న ప్రత్యామ్నాయ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ స్వాతి సూచించారు. శుక్రవారం ఆమె స్థానిక మార్కెట్ యార్డులోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యామ్నాయ విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందిని కలిసి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రత్యామ్నాయ సబ్సిడీ విత్తనాలను పొందిన ప్రతి రైతూ తప్పనిసరిగా పంట సాగు చేపట్టాలన్నారు. ప్రతి రైతుకూ గరిష్టంగా ఐదు ఎకరాలకు విత్తనాలు అందజేస్తామన్నారు.

రాష్ట్రపతి అవార్డుగ్రహీతకు సన్మానం


రహ్మాన్‌ను సన్మానిస్తున్న జైలు సిబ్బంది

బుక్కరాయసముద్రం: మండలంలోని జిల్లా జైలులో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ రహ్మాన్‌కు భారత ప్రభుత్వం రాష్ట్రపతి అవార్డు అందజేసిన నేపథ్యంలో.. జిల్లా జైలు సిబ్బంది శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఖైదీల సంక్షేమానికి, జైలు అభివృద్ధికి సూపరింటెండెంట్ రహ్మాన్ విశిష్ట సేవలు అందించారని సిబ్బంది కొనియాడారు. అనంతరం జైలు సిబ్బంది శాలువా పూల మాలతో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఓపెన్ ఎయిర్ జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖర్, జైలు మెడికల్ ఆఫీసర్ నాగరాజు, డిప్యూటీ జైలర్లు హరీష్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైద్యసేవల నిలిపివేత

గుంతకల్లుటౌన్: కలకత్తాలోని ఆర్‌జీ.కర్ మెడికల్ కాలేజీ వైద్యురాలిపై అత్యాచారం చేసి హతమార్చడాన్ని నిరసిస్తూ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో శనివారం ఉదయం 6 నుంచి 24 గంటల పాటు వైద్యసేవలు నిలిపివేయనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంతకల్లు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కీర్తికిరణ్‌రెడ్డి, డాక్టర్ జిలాన్ తెలిపారు. అత్యవసర సేవలు మినహా అన్నిరకాల వైద్యసేవలు బంద్ చేస్తున్నట్లు వారు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని వైద్యులు, సిబ్బంది రక్షణకు కఠిన చట్టాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న పోరాటానికి ప్రజాసంఘాలు, ప్రజలు మద్దతివ్వాలని వారు కోరారు.

హిందువులపై దాడి దారుణం


ర్యాలీ చేస్తున్న దృశ్యం

గుత్తి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ గుత్తిలో శుక్రవారం గౌతమి పురి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. రాయల్ సర్కిల్ వద్ద నుంచి గాంధీ సర్కిల్ మీదగా ఎన్టీఆర్ సర్కిల్ వరకూ ర్యాలీ కొనసాగింది. బంగ్లాదేశీయులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. జై భారత్, జై హిందువు అంటూ నినాదాలతో హోరెత్తించారు.

వ్యక్తికి గాయాలు

పుట్లూరు: మండలంలోని సూరేపల్లి సమీపంలో శుక్రవారం ద్విచక్రవాహనం అదుపుతప్పిన ఘటనలో సుబ్బరాయుడు అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కడవకల్లు నుంచి స్వగ్రామమైన సూరేపల్లికి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వ్యక్తిని వెంటనే తాడిపత్రి ఆస్పత్రికి తరలించారు.

చేతిపంపునకు మరమ్మతులు చేపట్టండి

పామిడి: పట్టణంలోని కాగితాలవీధిలో చెడిపోయిన చేతిబోరుకు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు శుక్రవారం ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్‌కు అర్జీ అందజేశారు. ఎంపీడీఓ సానుకూలంగా స్పందించారు. సింగిల్ ఫేస్ మోటారు ఏర్పాటు చేసి నీటిఎద్దడి తీరుస్తామన్నారు.

నిబంధనలకు 'నీళ్లు'

- వాటర్ ప్లాంట్లలో నాణ్యతకు తూట్లు
- పట్టించుకోని అధికారులు


యాడికిలోని శుద్ధ జల కేంద్రం

యాడికి: ప్రజల అవసరాలే పెట్టుబడిగా వాటర్ ప్లాంట్ల యజమానులు నీటి వ్యాపారం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో రక్షిత మంచి నీటి పథకాలు నిర్వహణ అంతంత మాత్రంగానే ఉండటంతో ఆర్వో వాటర్ ప్లాంట్ల యజమానులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. గ్రామ పంచాయతీ కుళాయిల నుంచి కలుషిత నీరు సరఫరాతో గత్యంతరం లేక ప్రజలు శుద్ధ జల కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొంత మంది అనుమతుల్లేకుండా ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలను దోచుకుం టున్నారు. తొలుత 20 లీటర్ల నీటిని రూ.2లకే ఇచ్చారు. ప్రజలు అలవాటు పడిన తరువాత ప్రస్తుతం క్యాన్ వాటర్‌కు రూ.15 నుంచి రూ20 వరకూ వసూలు చేస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

నిబంధనలు బేఖాతర్..

తాడిపత్రి నియోజకవర్గంలోని 140 దాకా ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి. ఈ ప్లాంట్ల నుంచి చిన్న పాటి మినీ ట్యాంకుల ద్వారా పట్టణం, గ్రామాలకు నీటిని చేర వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 2006లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆహార భద్రతా చట్టం ప్రకారం ప్లాంట్లలో నిబంధనలు పాటించాలి. వాటర్ ప్లాంట్‌కు తప్పనిసరిగా ఐఎస్ఐ గుర్తింపు ఉండాలి. ప్లాంట్లను ప్రతి నెలా అధికారులు తనిఖీ చేయాలి. క్లోరినేషన్, నీటి శుద్ధి ప్రక్రియలను పరిశీలించాలి. తనిఖీ అనంతరం నీటిని పరీక్షలకు పంపించాలి. పరీక్షల్లో ఏమైనా తేడాలు అనిపిస్తే నోటీసులు జారీ చేసి ప్లాంట్లను మూసి వేయించాలి. మండలంలో కొన్ని ఏళ్లుగా ఎక్కడా తనిఖీలు జరిగిన దాఖలాలు లేవు. ప్లాంట్లను పరిశీలించాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

మండలం	ఆర్వో ప్లాంట్లు
తాడిపత్రి	110
పెద్దపప్పూరు	6
యాడికి	10
పెద్దవడుగూరు	12

నిబంధనలు..

వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధిత పట్టణ, గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తప్పనిసరి. వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలంటే తప్పనిసరిగా ఐఎస్ఐ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి. 12 రకాల ధ్రువీకరణ పత్రాలు ప్లాంట్ల యజమాని కలిగి ఉండాలి వాటర్ ప్లాంట్లో తప్పని సరిగా ఒక మైక్రో బయాలజిస్టు, కెమిస్ట్ ఉండాలి. రోజూ నీటి పరీక్షలు జరపాలి. ఇలాంటివేవీ చేయకపోవడంతో యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నీరు సరిగా శుద్ధికాకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



అధికారులు వాటర్ ప్లాంట్లపై తరచూ దాడులు నిర్వహించాలి. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాంట్లను గుర్తించి సీజ్ చేయాలి. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే ప్రజలు అనారోగ్యం బారిన పడతారు.
–ఆదంబాబు, కోనుప్పలపాడు, యాడికి మండలం

నీటి దోపిడీని అరికట్టాలి



గ్రామాల్లో నీటి దోపిడీని అరికట్టాలి. శుద్ధ జలం పేరుతో మామూలు నీటిని విక్రయించటం వల్ల ప్రజల జేబులు ఖాళీ అవటమే కాకుండా అనారోగ్యాల బారిన పడుతున్నారు. స్వచ్ఛమైన నీరు ప్రజలకు అందేటట్లు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.
– డి. దేవేంద్ర యాదవ్, పుప్పాల, యాడికి మండలం

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ఉంటే తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యకర్తలతో వాటర్ ప్లాంట్లను తనిఖీలు చేపడతాం. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేస్తే ప్లాంట్లను సీజ్ చేస్తాం.
– వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ, యాడికి మండలం

పోలీసుల అదుపులో ప్రేమికులు


ప్రేమికులు విజయ్, షాకీర

తాడిపత్రి రూరల్: ఇరువర్గాల తల్లిండ్రులు పట్టించుకోకపోవడంతో పారిపోయిన ప్రేమ జంటను అదుపులోకి తీసుకున్నామని శుక్రవారం అప్‌గ్రేడ్ రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. వివరాలు.. తాడిపత్రి మండలం సజ్జలదిన్నెకు చెందిన విజయ్, బ్రహ్మణపల్లిలోని షాకీర పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో ప్రేమలో పడ్డారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు షాకీరను చదువు మానిపించారన్నారు. దీంతో 15రోజుల క్రితం వారు పెళ్లి చేసుకుని, తల్లిదండ్రుల నుంచి రక్షణ కల్పించాలని పోలీసు స్టేషన్‌కు వచ్చారు. దీంతో పోలీసులు వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి, ప్రేమికులు వివాహం జరిపిస్తామని పెద్దమనుషుల సమక్షంలో ఒప్పించారు. దీంతో ప్రేమికులు ఎవరి ఇళ్లకు వారు వెళ్లారు. 15 రోజులు దాటినా వివాహం చేయకపోవడంతో అనుమానం వచ్చిన ప్రేమికులు మరోసారి ఇంటి నుంచి పారిపోయారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు.. గాలించి వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఇరువురు తల్లిదండ్రుల సమక్షంలో పోలీసులు ప్రేమికులను ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆంజనేయ ప్రసాద్ వద్ద హాజరుపరిచారు. ఇద్దరూ మేజర్లు కావడంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్ స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. తల్లిదండ్రులను వదిలిపెట్టి ప్రియుడు విజయ్‌తో వెళ్లడానికి షాకీర అంగీకరించడంతో అతడికి అప్పగించారు. ప్రేమికుల జోలికి వెళ్లకూడదంటూ ఇరువురి కుటుంబ సభ్యులను హెచ్చరించి పంపామని సీఐ తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి

గుత్తి రూరల్: వచ్చే నెలలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి ఆదేశించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ ఓబిలేసుతో కలసి ఆర్డీఓ రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ వచ్చే నెల మొదటి వారంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతాయన్నారు. గ్రామాల్లో దండోరా వేయించి రెవెన్యూ సదస్సుల్లో రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. రైతుల నుంచి అందిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సంబంధిత స్థల యజమానులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సదస్సులలో వీఆర్‌ఓ, గ్రామ సర్వేయర్లు తీసుకోవాల్సిన చర్యలను ఆర్డీఓ వివరించారు. కార్యక్రమంలో డీటీలు లలిత, శ్రీలత, ఆర్‌ఐ సందీప్, వీఆర్‌ఓలు కిశోర్, రంగయ్య, శివారెడ్డి, పవిత్ర, అనురాధ, రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాయకత్వ నైపుణ్యాలు అవసరం


అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు చదువుతోపాటు నాయకత్వ నైపుణ్యాలు ఎంతో అవసరం అని రోటరీ జిల్లా రొటేరియన్ కేశవరెడ్డి, రోటరీ బాలల సంక్షేమ చైర్మన్ రొటేరియన్ శాంతా రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రోటరీ పురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో రోటరాక్ట్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఐటీ రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షుడిగా మెకానికల్ తృతీయ సంవత్సరం చదువుతున్న మహమ్మద్ ఇలియాజ్, కార్యదర్శిగా ఈఈఈ తృతీయ సంవత్సరం చదువుతున్న మాధవీలతను నియమించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ రోటరాక్ట్‌లో పాల్గొనడం వల్ల విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చన్నారు. అలాగే ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ నిధుల సేకరణ, మార్కెటింగ్, కమ్యూనికేషన్ వంటి ఆచరణాత్మక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రోటరీ బాలల సంక్షేమ చైర్మన్ రొటేరియన్ శాంతారాజ్, తేజ, నాగార్జున, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, సివిల్ విభాగం అధిపతి డాక్టర్ చిన్న వెంకటరెడ్డి, రోటరాక్ట్ క్లబ్ సలహాదారు వెంకట సునీల్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ నాగలక్ష్మి, అరవింద్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరుణ దేవా.. కరుణ చూపించు


బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న కదిరిపల్లి గ్రామస్తులు

గుంతకల్లు రూరల్: వరుణదేవా కరుణించు అంటూ మండలంలోని కదిరిపల్లిలో గంగమ్మ దేవతకు శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు వెంటాడుతుండటంతో సాగు చేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయి. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య సైతం ఎక్కువవుతుంది. ఈ క్రమంలో మండలంలోని కదిరిపల్లి గ్రామస్తులు వర్షాల కోసం వరుణుడిని ప్రార్థిస్తూ గంగమ్మ దేవతకు బోనాలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలింపు

పామిడి: స్థానిక ఎద్దులపల్లి రైల్వే గేట్ వద్ద నుంచి వాహనంలో కర్ణాటక ప్రాంతానికి తరలిస్తూ పట్టుబడ్డ రేషన్ బియ్యాన్ని గుంతకల్ ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలించినట్లు సీఎస్‌డీటీ అన్సర్ శుక్రవారం తెలిపారు. సీఐ ఎం.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్రమంగా బియ్యం తరలిస్తున్న సురేష్ (డోన్), సోమందేపల్లివాసులు హరీష్, నందీశ్వర్‌ను గురువారం అరెస్టు చేశారన్నారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న 5.3 టన్నుల పీడీఎస్ రైస్‌ను సీఎస్‌డీటీ ఆధ్వర్యంలో గుంతకల్లు ఎఫ్‌సీఐకి తీసుకెళ్లారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల చేయూత


అనారోగ్యానికి గురైన కాంట్రాక్ట్ ఉద్యోగి జయరాంకు నగదు అందజేస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌కు చెందిన విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగి జయరాంకు సహ ఉద్యోగులు అండగా నిలిచి ఆర్థిక సాయం అందజేశారు. వివరాలు.. విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగి(షిఫ్ట్ ఆపరేటర్) జయరాం గత ఆరు మాసాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. డ్యూటీకి వెళ్లకపోవడంతో జీతం రాలేదు. కుటుంబ గడవటం కష్టమైంది. తోటి ఉద్యోగులు జయరాంకు అండగా నిలిచారు. ఈ క్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు చందాలు వేసుకుని రూ. 86,600 సేకరించారు. ఏపీ విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం జయరాం ఇంటికి వెళ్లి రూ.86,600 అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

ఘనంగా మన్యుసూక్త హోమం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని స్వామిని ప్రార్థిస్తూ కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం మన్యుసూక్త హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ యాగశాలలో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మన్యుసూక్తహోమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఉత్తమ సేవా పురస్కారం


ఎస్పీ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్

గుంతకల్లు: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హెడ్ కానిస్టేబుల్ డి.వెంకటేష్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఆయన కసాపురం పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని గురువారం అనంతపురంలోని పోలీసుపేరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను సహచారులతోపాటు బంధువులు, మిత్రులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం


తాడిపత్రిలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు


గుత్తిలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం


గుంతకల్లు: బంగారు చీర అలంకరణలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు

తాడిపత్రి అర్బన్/గుంతకల్లు/గుత్తి/పెద్దపప్పూరు/బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో వరలక్ష్మీ వత్రాన్ని మహిళలు ఘనంగా ఆచరించారు. శుక్రవారం తెల్లవారుజామునే ఇళ్లలో అమ్మవారి విగ్రహాన్ని కొలువుదీర్చి వివిధ రకాల మధురమైన పదార్థాలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు. పూజ అనంతరం ముత్తైదువులకు నానబెట్టిన శెనగలు, పెసలు వాయినంగా ఇచ్చా. ఈసందర్భంగా తాడిపత్రి పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం, చింతల వెంకటరమణస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరీ ఆలయం, వేదగాయత్రీ దేవి ఆలయం, జంగం వారి వీధిలోని అంకాలమ్మ, గానుగ వీధిలోని చౌడేశ్వరీదేవి, అంభాభవాని వీధిలోని అంభాభవాని ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వరలక్ష్మీ వ్రతం, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

- గుంతకల్లులోని కన్యకా పరమేశ్వరి మూలవిరాట్‌ను స్వర్ణ చీరతో ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళ నేతృత్వంలో వరలక్ష్మీ వత్రంను ఆచరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు గోపా జగదీష్, నాయకులు కందూరి కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.
- గుత్తి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ప్రధాన అర్చకుడు వాసుదేవశర్మ, ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిషోర్ బాబు, కోశాధికారి తాయి వెంకటేష్, వాసవీ మహిళ మండలి సభ్యులు ఉమాదేవి పాల్గొన్నారు.
- పెద్దపప్పూరు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాల్లో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తి,శ్రద్ధలతో ఆచరించారు.


తాడిపత్రిలోని గాయత్రి మాత ఆలయంలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు


గుత్తిలో అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరి


పెద్దపప్పూరులో వరలక్ష్మీదేవి


బుక్కరాయసముద్రంలో ముసలమ్మ తల్లి

మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

పుట్లూరు: ఈదురు గాలుల వల్ల మొక్కజొన్న రైతులు నష్టపోయారని, వారికి సకాలంలో పరిహారం చెల్లించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఏపీ కౌలు రైతు సంఘం, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు దెబ్బతిన్న మొక్కజొన్న పొలాలను పరిశీలించారు. ఈ నెల 14, 15న ఈదురు గాలులు వీయడంతో అరకటివేముల గ్రామంలో మొక్కజొన్న సాగు చేసిన పలువురు రైతులు నష్టపోయారన్నారు. ఈదురు గాలులకు పంట దెబ్బతిన్న రైతులను గుర్తించి ఎకరాకు రూ.50వేలు పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామాంజినేయులు, గోపాల్, చిన్నికృష్ణుడు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.